# ఈనాడు కర్నూలు



## కొత్త ప్రయాణం




కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచేలా తీర్చిదిద్దుతామని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు-1వ డిపో గ్యారేజీలో రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులు, ఒక కొత్త అల్ట్రా డీలక్స్ బస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాయలసీమలో మంచి కన్వెన్షన్ హాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు ప్రజా రవాణాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు సూపర్ లగ్జరీ బస్సులను కర్నూలు-బెంగళూరు మధ్య, ఒక అల్ట్రా బస్సును కర్నూలు-తిరుపతిలో మార్గంలో నడుపుతామన్నారు. ఇప్పటి వరకు కర్నూలు ఆర్టీసీకి 13 కొత్త బస్సులు వచ్చాయన్నారు. కర్నూలు-1, 2 డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుస్సేన్, మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

–కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే

## కాల్వబుగ్గ ఆలయంలో అక్రమాలపై విచారణ

ఓర్వకల్లు న్యూస్‌టుడే : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ బుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో దేవాదాయ శాఖ జిల్లా సహాయ సంచాలకులు సుధాకరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం విచారణ చేపట్టారు. ఆలయంలోని పలు దస్త్రాలు, బ్యాంకు ఖాతాలు తనిఖీ చేశారు. రూ. లక్షల్లో నగదు బదిలీ అయినట్లు గుర్తించి విచారిస్తున్నట్లు సుధాకరరెడ్డి తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఆలయ భూముల్లో విద్యుత్తు టవర్లు వెళ్లిన నేపథ్యంలో వాటికి సంబంధించిన నిధులు పక్కదారి పట్టించారని, ఆ నిధులను సొంత ఖాతాకు జమ చేసుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈవో మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## పల్లెకు ప్రగతి దారులు

■ ఈనెల 14 నుంచి 21 వరకు పల్లె పండగ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : పల్లెలను గత వైకాపా ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేసింది. పంచాయతీ నిధులు పక్కదారి పట్టించింది. ఆర్థిక సంఘం నిధులను పథకాలకు మళ్లించింది. ఫలితంగా గ్రామాల్లో కనీస వసతులు కరవయ్యాయి. కనీసం పారిశుద్ధ్య పనులు చేయలేని పరిస్థితి. చాలా ప్రాంతాల్లో పలువురు సర్పంచులు తమ సొంత నిధులు ఖర్చు చేశారు. బిల్లులు రాక అప్పల పాలయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. పల్లెవాసుల కష్టాలు తీరనున్నాయి. ఉపాధి నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు సమకూర్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

| నియోజకవర్గం | సీసీ దారులు | నిధులు (రూ.కోట్లు) |
|---|---|---|
| పత్తికొండ | 191 | 11.19 |
| కోడుమూరు | 189 | 11.55 |
| మంత్రాలయం | 144 | 9.56 |
| ఎమ్మిగనూరు | 59 | 6.08 |
| ఆదోని | 30 | 2 |
| ఆలూరు | 186 | 11.78 |

### గ్రామసభల్లో సమస్యలు గుర్తించి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకుగాను ఆగస్టు 23వ తేదీన గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను పాలకులు, అధికారులు గుర్తించారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు 'పల్లె పండగ' నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి గ్రామంలో రహదారులు, కాలువలు, ఇతర వసతులు కల్పించేందుకు శంకుస్థాపలు చేయాలని నిర్ణయించింది. సర్పంచులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించి వివిధ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు రహదారుల పనులు పూర్తి చేసి మరో పండగ నిర్వహించేలా ప్రభుత్వం లక్ష్యాలు విధించింది.

### ఉపాధి నిధుల సద్వినియోగం

- కర్నూలు జిల్లాలో 798 సీసీ రహదారుల నిర్మాణాలకు ఉపాధి హామీ కింద రూ. 52.23 కోట్లు మంజూరయ్యాయి. కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున సీసీ రహదారుల పనులు చేపట్టనున్నారు.
- జిల్లాలో పూర్తిగా రహదారి వసతి లేని 36 గ్రామాలను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వీటి నిర్మాణానికి రూ. 14.25 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. రహదారుల పనులు పూర్తైతే ఆయా గ్రామాల రూపురేఖలు మారనున్నాయి. ఏళ్ల తరబడి రహదారి సౌకర్యం లేని పల్లెవాసుల కష్టాలు తీరనున్నాయి.

## కొండ కరిగి.. ప్రమాదం మిగిలి



గత వైకాపా ప్రభుత్వ హయాంలో కోడుమూరులో కొండ చుట్టూ పెద్దఎత్తున ఎర్ర మట్టి తవ్వి తరలించేశారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాల్లో మట్టి తరలించి సొమ్ము చేసుకున్నారు. నాయకుల అండదండలు ఉండటం.. అధికారులు పట్టించుకోకపోవడంతో చాలావరకు కొండ కరిగిపోయింది. విద్యుత్తు స్తంభాలు చుట్టూ తవ్వేయడంతో స్తంభాలు గాలిలో ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. – ఈనాడు, కర్నూలు

## అక్రమ పునాదులు




■ 509 ప్లాట్లు అనర్హులకు ■ రూ.300 కోట్లు పక్కదారి

■ నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సంఘంలో అవినీతి బాగోతం

నగరంలో నాలుగో తరగతి ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సొసైటీలో 'గూడు' పురాణి జరిగింది.. అర్హులకు మొండిచేయి చూపి రూ.250–300 కోట్ల విలువ చేసే ప్లాట్ల ( ఒక ప్లాట్ 2.75 సెంట్లు.. దాని ధర రూ.40 లక్షలు)ను ఇతరులకు అమ్మేశారు. 102 ప్లాట్లు, మిగిలిన స్థలాలు అక్రమంగా రిజిస్ట్రేషన్ అయినట్లు గుర్తించారు. అక్రమాల బాగోతాన్ని తేల్చాలని గత నెల 19వ తేదీన జేసీ ఆదేశించారు. అనర్హులకు తాఖీదులిచ్చి స్థలాలు రద్దు చేయాలని జేసీ ఆదేశించినా కమిటీ సభ్యులు, సహకార అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఉద్యోగులు పోరాటానికి సిద్ధం అవుతున్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

### సభ్యులను పెంచి స్థలాన్ని కుదించి

కర్నూలు జిల్లా నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల గృహ నిర్మాణ సహకార సంఘం లిమిటెడ్ (సి.పి. నంబరు. 1155)లో మొదట 731 మంది సభ్యత్వం తీసుకొన్నారు. తర్వాత సభ్యుల సంఖ్యను పెంచుకుంటూ పోవడంతో 1,400 మందికి చేరింది. దీంతో ఒక్కో ఇంటి నిర్మాణానికి 2.75 సెంట్ల ప్రకారం 1,462 ప్లాట్లుగా మార్చారు. అందులో 900 మందికి స్థలాలు కేటాయించారు. మిగిలిన ప్లాట్లకు అలాట్‌మెంట్ నంబరు, పట్టా ఇచ్చినా ఆ ప్లాట్లను వారికి చూపలేదు. సొసైటీ అధ్యక్షులుగా పనిచేసిన ఐదుగురు ఇతరులకు మిగిలిన స్థలాలు అమ్మి రూ.కోట్లు స్వాహా చేశారు.

### అక్రమాలకు సహకారం

స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే సహకార సొసైటీ పాలకవర్గానికి ఒక ప్లాటుకు రూ. 7 లక్షలు చెల్లించాలన్న నిబంధన పెట్టారు. ఆ మొత్తంలో సహకార అధికారికి రూ. 2 లక్షలు, పాలకవర్గ సభ్యులకు రూ. 5 లక్షలు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అనుమతి ఇస్తారు. అక్రమంగా ప్లాట్లు పొందినవారి నుంచి రూ. లక్షల్లో వసూలు చేసి అవినీతికి పాల్పడ్డారు. 509 ప్లాట్లు అనర్హులకు ఇచ్చినట్లు నిర్ధారించినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు.

| సంఘం ఏర్పాటు: 1980 | సభ్యులు: 731 | సేకరించిన భూమి: 80.20 ఎకరాలు | ఒక్కరికి కేటాయించిన స్థలం: 5.50 సెంట్లు (తర్వాత కుదించారు) |
|---|---|---|---|

### పాత్రధారులు వీరే

- తప్పుడు కులధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఓ వ్యక్తి సభ్యత్వ రుసుము చెల్లించకుండానే సంఘంలో చేరిపోయారు.. ఏకంగా అధ్యక్ష పీఠంపై కూర్చొన్నారు.. ఆయనొక్కడే 365 ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తన కుటుంబ సభ్యుల పేర్లపై పది ప్లాట్ల వరకు తీసుకొన్నారు. అక్రమాలు ఎక్కడ బయటకొస్తాయోనన్న ఉద్దేశంతో స్వచ్ఛంద విరమణ పొందారు.
- ఉద్యాన శాఖలో తోటమాలిగా పనిచేసిన మరో వ్యక్తి సభ్యత్వ రుసుము చెల్లించకుండానే ఆ సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సుమారు 50 ప్లాట్లను ఇతరులకు విక్రయించారన్న విమర్శలున్నాయి. ఆ తర్వాత అధ్యక్షపీఠంపై కూర్చొన్న మరో ఇద్దరు 30 ప్లాట్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు విచారణలో తేలింది.
- వ్యవసాయ శాఖలో పనిచేసే ఓ వ్యక్తి సంఘానికి అధ్యక్షుడయ్యారు.. దొంగ ఓట్లతో అధ్యక్షపీఠంపై కూర్చొన్న ఆయన హయాంలో 60కి పైగా ప్లాట్ల క్రయవిక్రయాలు జరిగాయి.

### 30 ఏళ్లుగా పోరాటం

నాలుగో తరగతి ఉద్యోగి డి.లక్ష్మీనారాయణ సంఘంలో సభ్యత్వం తీసుకోవడంతోపాటు రూ. 1300 ప్లాట్ కోసం చెల్లించారు. మొదట 235బి ప్లాట్ కేటాయిస్తూ ఇంటి పత్రం ఇచ్చారు. దాన్ని మరొకరికి కట్టబెట్టడంతో 277 ప్లాట్ ఇచ్చారు. ఇంటి స్థలం చూపాలని పోరాటం చేస్తూ చనిపోయారు. ఇంటి స్థలం కోసం ఆయన భార్య ఎం. సంజమ్మ, కుమారుడు హిమవంతుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 2014లో 737ఎ ప్లాట్‌ను కేటాయిస్తూ పట్టా చేతికిచ్చారు. అక్కడికెళ్తే ఇతరులు ఇల్లు నిర్మించుకొని ఉండటం గమనార్హం.



### నిగ్గుతేల్చినా చర్యల్లేవు

- 270 స్థలాలు ఇతరులకు అమ్మేసినట్లు ఫిర్యాదులు రావడంతో 2006-07 మధ్యకాలంలో అప్పటి జిల్లా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన వెంకటకృష్ణ విచారణ చేపట్టారు. అక్రమాలు నిర్ధారించి నివేదికలిచ్చారు.
- 2014లో అప్పటి కలెక్టర్ సుదర్శన్‌రెడ్డి మళ్లీ విచారణ చేయించగా మరో 102 ప్లాట్లు బోగస్ అని తేలింది.
- 2016-17లో డిప్యూటీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి విచారణ చేయగా మరో 137 ప్లాట్లు అనర్హులకు కేటాయించారని.. 150-200 వరకు క్రయవిక్రయాలు జరిగినట్లు తేల్చారు.

## అమ్మకు కాసుల హారం



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కర్నూలు జిల్లా మంత్రాలయంలోని వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అమ్మవారు ధనలక్ష్మీ రూపంలో దర్శనమిచ్చారు. మంగళవారం అమ్మవారిని రూ. 4 లక్షలతో అందంగా అలంకరించారు. ఇందులో రూ. 10, రూ. 20, రూ. 100, రూ. 200 నోట్లను వాడారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే:

## భాజపా నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ సస్పెన్షన్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆదోని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ నాయకత్వం ఆయనకు తాఖీదులు ఇచ్చిందని, దీనికి ఎలాంటి సంజాయిషీ ఇవ్వలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో భాజపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ వెంకటసత్యనారాయణ ఆదేశాలమేరకు ప్రకాశ్‌జైన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామన్నారు.

## దోపిడీ మార్గం

■ ప్రైవేటు బస్సుల దందా
■ ఇష్టానుసారంగా ఛార్జీల వసూలు
■ తనిఖీలు మరచిన అధికారులు

దసరా నేపథ్యంలో ప్రైవేటు వాహనాలు దోపిడీకి తెర తీశాయి. ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని టికెట్ల ధరలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా నిత్యం 65 ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ సుమారు 3 వేల మందికి పైగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా డిమాండ్ నేపథ్యంలో రెండింతలు వసూలు చేస్తున్నారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే :

### చెక్‌పోస్టులు ఎత్తేసిన వైకాపా



కర్నూలు నగర శివారులోని పంచలింగాల, శ్రీశైలం సున్నిపెంట మార్గంలో గతంలో రవాణా శాఖకు సంబంధించిన చెక్‌పోస్టులు ఉండేవి. గత వైకాపా ప్రభుత్వం వీటిని ఎత్తేసింది. ఫలితంగా ప్రైవేటు వాహనాలపై నిఘా కరవైంది. ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు కానరావడం లేదు. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కినా పట్టించుకునేవారే కరవయ్యారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు పలు మార్గాల్లో నిరంతరం ప్రత్యేక తనిఖీలు చేయాల్సి ఉంది.. ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేసినా.. బస్సులకు ఫిట్‌నెస్ లేకున్నా జరిమానా విధించడం.. వాహనాలు సీజ్ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు.

| ప్రాంతం | ఆర్టీసీ | | ప్రైవేటు |
|---|---|---|---|
| | సూపర్ లగ్జరీ(రూ.) | ఏసీ(రూ.) | బస్సుల్లో(రూ.) |
| విజయవాడ | 555 | 671 | 900-1,250 |
| బెంగళూరు | 579 | 723 | 890-1,280 |
| చెన్నై | 776 | - | 800-1,235 |
| తిరుపతి | 543 | 686 | 810-1,300 |
| హైదరాబాద్ | 344 | 416 | 935-1,300 |

### తనిఖీలు నిర్వహిస్తాం

– శాంతకుమారి, ఉప కమిషనర్, జిల్లా రవాణా శాఖ

వాహనాల తనిఖీకి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. రెగ్యులర్ విధులు ముగిసిన తర్వాత రాత్రివేళల్లోనూ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. వాహన సామర్థ్యం సరిగా లేకపోయినా.. వాహన పన్నులు చెల్లించకపోయినా.. ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినా జరిమానా విధిస్తాం. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందితే బస్సులు సీజ్ చేసేందుకూ వెనుకాడం.

### విధి లేక ప్రైవేటు మార్గం

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, బళ్లారి తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం చాలామంది కర్నూలు నగరంతోపాటు నంద్యాల పట్టణంలో నివసిస్తుంటారు. దసరా పండగ నేపథ్యంలో దాదాపు అందరూ తమ స్వప్రాంతాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఎక్కువగా బస్సులు నడపాల్సి ఉంది. ఆ దిశగా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో జనం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది.

### ఆదరణ లభించినా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 డిపోల పరిధిలో 966 బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం పండగల సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల నుంచి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదు. మరోవైపు రానుపోను టికెట్ నమోదు చేసుకుంటే 10 శాతం వరకు రాయితీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బస్సుల్లో చాలామంది ప్రయాణికులు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ బస్సులు కాకుండా 60కి పైగా అదనంగా బస్సులు నడుపుతున్నారు. వీటిల్లోనూ రాయితీ సౌకర్యం కల్పించారు. పండగల నేపథ్యంలో సీటన్నీ రిజర్వ్ అయిపోవడంతో చివరికి ప్రైవేటు బస్సులే దిక్కవుతున్నాయి.

## టెట్‌కు 270 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 270 మంది గైర్హాజరైనట్లు ఇన్‌ఛార్జి డీఈవో శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెషన్‌లో 1,614 మందికి గాను 1,464 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,612 మందికి గాను 1,492 మంది పరీక్ష రాసినట్లు చెప్పారు.











## కాత్యాయని అభయ ప్రదాయిని




జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు నేత్రశోభితంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం భ్రమరాంబాదేవి చేతిలో ఖడ్గం ధరించి భక్తజనులకు అభయ ప్రదాయినిగా సాక్షాత్కరించారు. పరమేశ్వరుడు శిరస్సున చంద్రవంకను ఆభరణంగా ధరించి ఇష్టసఖీ పార్వతి చెంత ఆశీనులయ్యారు.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే



# కొలను భారతి.. జన హారతి

## నేడు సరస్వతిదేవిగా అమ్మవారి దర్శనం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: చదువుల తల్లి సరస్వతి దేవి కొలువుదీరిన కొలనుభారతిలో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా శరన్నవ రాత్రుల్లో ఏడోరోజు అమ్మవారు తన స్వయంభూ అలంకరణలో సరస్వతిదేవిగా దర్శనమివ్వనున్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్యన చారుఘోషిణి నది ఒడ్డున సరస్వతి ఆలయం కొలనుభారతి క్షేత్రంగా నామకరణం పొందింది. చారుఘోషిణి నది వర్ష, వేసవి కాలాలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ సహజంగా ప్రవహించడం విశేషం. ఇక్కడ అమ్మవారు స్వయంభుగా పుస్తక ధారిణి రూపంలో దర్శనం ఇస్తారు. 11వ శతాబ్దికి చెందిన మల్లభూపతి అనే చాళుక్యరాజు నిర్మించినట్లు శిలాశాసనాలను ద్వారా తెలుస్తోంది. సరస్వతిదేవిని వేదమాతగా, భారతిగా, వాగేశ్వరిగా, శారదగా మన పూర్వికులు అభివర్ణించారు. ఇంతటి శక్తివంతమైన కొలనుభారతి అమ్మవారిని జ్ఞాన స్వరూపిణిగా భావిస్తారు.



కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారు

### చేతిలో వేదాలు

కొలనుభారతిలో కొలువైన సరస్వతి అమ్మవారికి మూలవిరాట్ ఎదురుగా శ్రీచక్రం ఉండటం విశేషం. అంతేకాకుండా అమ్మవారి చేతిలో వేదాలు ధరించి ఉన్న పుస్తాకపాణిగా కనబడుతుంది. నాలుగు కరములు కలిగిన అమ్మవారు ఉత్తర ముఖంగా దర్శనం ఇస్తున్నారు. కుడి రెండు చేతుల్లో పాశం, అభయ హస్తం, ఎడమవైపు రెండు చేతుల్లో పుస్తకం, అంకుశం కనిపిస్తాయి.

### రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రం

కొలనుభారతి ఆలయం అతిపురాతనమైనది. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో రెండో సరస్వతి క్షేత్రంగా ఉండేది. క్షేత్ర ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక విశిష్టత, చరిత్రను బట్టి బాసర సరస్వతి దేవస్థానం కన్నా పురాతన దేవాలయంగా చరిత్రకారులు భావిస్తున్నారు.

### తప్పక చూడదగ్గ ప్రాంతం

కొలనుభారతి దేవి సన్నిధిలో అక్షరాభ్యాసం, బీజాక్షరాలు, విద్యాభ్యాసం ప్రారంభిస్తే అత్యున్నత స్థాయికి చేరుకుంటారని భక్తుల విశ్వాసం. అంతేకాక ఈ గుడి ఆవరణలో సప్త శివాలయాలు ఉన్నాయి. పక్కనున్న జలధార గల గల పారుతూ, పచ్చటి చెట్ల మధ్య నుంచి పక్షులు చేసే శబ్దాలను, ఆ క్షేత్రానికి ప్రారంభంలో ఉన్న అందమైన గోపాల కృష్ణున్ని తిలకించాలంటే ఆ క్షేత్రం తప్పక దర్శించాల్సిందే.

### సప్త శివాలయాలు

ఆలయ ఆవరణలో సప్త శివాలయాలు ఉన్నాయి. ఈ శివాలయాల్లో ఒక ఆలయం తూర్పు ముఖం గాను, మిగిలిన మూడు ఆలయాలు దక్షిణం వైపు ఉన్నాయి. నాలుగు ఆలయాలకు ఒకే ధ్వజస్తంభం ఉండటం విశేషం.

### క్షేత్రానికి చేరుకోవాలంటే

ఆత్మకూరు నుంచి కపిలేశ్వరం వెళ్లే బస్సులో శివపురం గ్రామం చేరుకోవాలి. లేదా ఆత్మకూరు పాతబస్టాండు నుంచి శివపురం గ్రామానికి వెళ్లే ఆటోలో వెళ్లాలి. శివపురం నుంచి ఐదు కి.మీ. అటవీ మార్గంలో ఆటోలో లేదా నడుచుకుంటూ కొలనుభారతి క్షేత్రం చేరుకోవచ్చును.



కొలనుభారతి క్షేత్రం సమీపంలో జాలువారుతున్న జలపాతం

# టమాటా.. కాసుల పంట

## ☛ రిటెయిల్ అమ్మకాల్లో కిలో టమాటా రూ.100 పైనే

కళతప్పిన పొలాలు కాసులు కురిపిస్తున్నాయి. దిగుబడులు పోటీపడి దిగొస్తున్నాయి. కుదేలైన కుటుంబాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ఇంట్లో తిష్టవేసిన కష్టాలు గడపదాటుతున్నాయి. చుట్టూ పేరుకుపోయిన అప్పులు తీరిపోతున్నాయి. ఊహించని ధరలు ఆహ్వానిస్తున్నాయి. లాభాలతో జేబులు నిండుతున్నాయి. వర్షాల తర్వాత కోలుకున్న పంటలు రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. దిగుబడులు మెండుగా ఉన్నాయి.. లాభాలు మెరుగయ్యాయి.. రైతుల మోములు ఆనందంతో కళకళలాడుతున్నాయి.

\- న్యూస్‌టుడే, పత్తికొండ, మద్దికెర

### గండాలు గట్టెక్కి..

గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో టమాటా పంట పూర్తిగా దెబ్బతింది. తర్వాత కోలుకున్న పంటలు రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. దిగుబడులు మెండుగా వస్తుండటం, ధరలు సైతం అధికంగా ఉండటంతో రైతులకు లాభాలు దరిచేరుతున్నాయి. మరో వారం రోజుల్లో ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కిలో ధర రూ.200కు చేరినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్‌గా మార్కెట్లో రూ.50 నుంచి రూ.60 వలకు ధర లభిస్తోంది. రిటెయిల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.100కు పైగా పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోతలు, రవాణా తదితర ఖర్చులు పోను.. బాగానే మిగులుబాటు అవుతోందని, ఇది ఇలాగే కొనసాగితే మరింత ఆదాయం సమకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### పత్తికొండ నుంచి తెలంగాణ మార్కెట్లకు సరకు

పత్తికొండ టమాటా మార్కెట్ నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్న టమాట దిగుబడులను రోజూ తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆ మార్కెట్లలో ఇక్కడి పంటకు మంచి గిరాకి ఉండడంతో కొనుగోలు చేసిన సరుకును ఏ రోజుకారోజు గ్రేడింగ్ చేసి లారీల్లో తరలిస్తున్నారు. అక్కడ హోల్‌సేల్‌గా రూ.100కు పైగా ధర పలుకుతుండడంతో ఆ మార్కెట్లకే సరుకును పంపుతున్నారు.



పత్తికొండ టమాటా మార్కెట్

### దిగుబడి పెరిగితే ఎగుమతి

ప్రస్తుతం దిగుబడులు తక్కువగా ఉండటంతో తెలంగాణ రాష్ట్రంలోని మార్కెట్లకు మాత్రమే సరకు తరలిస్తున్నారు. రైతుల నుంచి దిగుబడి పెరిగితే తమిళనాడులోని చెన్నై, కర్ణాటకలోని హోసూర్, కృష్ణగిరి ప్రాంతాలకు తరలిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో దిగుబడులు భారీగా తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాటా సాగు**

| సం॥ | సాగు విస్తీర్ణం (హెక్టార్లు) | దిగుబడి (మెట్రిక్ టన్నులు) |
|---|---|---|
| 2019- 20 | 4,044 | 1,05,144 |
| 2020- 21 | 4,124 | 1,07,224 |
| 2021- 22 | 4,244 | 1,10344 |
| 2022- 23 | 9,163 | 4,30,454 |
| 2023- 24 | 7,230 | 2,16,900 |

**పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన సరకు (క్వింటాళ్లలో)**

| ఏ రోజు | వచ్చిన సరకు | కనిష్ఠ ధర | గరిష్ఠం | మధ్య ధర |
|---|---|---|---|---|
| గతనెల 29 | 742.55 | రూ.2,600 | రూ.4,500 | రూ.3,200 |
| 30 | 754.95 | రూ.2,600 | రూ.4,500 | రూ.3,300 |
| ఈ నెల 01 | 546.55 | రూ.2,500 | రూ.4600 | రూ.3,400 |
| 02 | 533.85 | రూ.3,000 | రూ.5,200 | రూ.3,500 |
| 03 | 563.3 | రూ.2,700 | రూ.5,000 | రూ.3500 |
| 04 | 550.6 | రూ.3,000 | రూ.6000 | రూ.4,000 |
| 05 | 551.2 | రూ.2,500 | రూ.5,500 | రూ.4,000 |
| 06 | 570.9 | రూ.2,600 | రూ.5,400 | రూ.4,000 |

### ఇప్పుడిప్పుడే పెట్టుబడి అందుతోంది

**- మహబూబ్‌బీ, రైతు, రాతన**

నేను ఎకరం పొలంలో టమాటా సాగు చేశా. గత నెలలో అధిక వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతిని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. దీనికి తోడు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టా. దిగుబడులు తగ్గినా.. ధరలు ఇలాగే కొనసాగితే నష్టం నుంచి పూర్తిగా బయటపడతాం.

### ధరలు కొనసాగితేనే..

**- లచ్చమ్మ, రైతు, కురవలదొడ్డి**

ఏటా మూడెకరాల్లో టమాటా సాగు చేస్తా. ఈ సారి కూడా మూడెకరాల్లో సాగు కోసం రూ.1.15 లక్షలు వెచ్చించా. ఇప్పుడిప్పుడే దిగుబడులు పెరిగాయి. ఈ రోజు 12 గంపలు మార్కెట్‌కు తెచ్చా. కిలో రూ.50 చొప్పున ధర పలికింది. అన్ని ఖర్చులు పోను రూ.5వేలు మిగిలింది. ఇప్పటి వరకు వచ్చిన సొమ్ము ఖర్చులకే సరిపోయేది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే మరింత లాభాలు వస్తాయి.

### రెండూ ఆశాజనకంగా ఉన్నాయి

**- ఈరన్న, టమాటా రైతు, పెరవలి**

ప్రస్తుతం పంట దిగుబడులు, మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మూడెకరాల్లో టమాటా సాగుకు రూ.90 వేలకు పైగా ఖర్చుచేశా. రెండు నెలల పాటు దిగుబడులు బాగా వచ్చినా.. ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఇప్పుడిప్పుడే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ధరలతో టమాటా రైతులందరూ సంతోషంగా ఉన్నారు. ఇదే ధరలు డిసెంబర్ వరకు కొనసాగితే ప్రతి రైతుకు మేలు జరుగుతుంది.

# అధికారం పోయినా.. అక్రమాలు ఆగడం లేదు

కోసిగి, న్యూస్‌టుడే: వైకాపా నాయకులు అధికారం కోల్పోయినా అవినీతి మాత్రం ఆగడం లేదు. అక్రమార్జనకు అలవాటుపడ్డవారు ఆగలేకపోతున్నారు. పట్టపగలే చెరువులో 10 టిప్పర్లు పెట్టి రెండు జేసీబీలతో గరుసును అక్రమంగా తరలిస్తున్నారు. అయినా రెవెన్యూ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కోసిగి మండలం దొడ్డి బెళగల్ గ్రామ శివారులోని చెరువులో మంగళవారం లారీలు, జేసీబీలతో వైకాపా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ముఖ్య అనుచరుడైన ఓ నాయకుడు తమ స్థలంలో ప్లాట్లు వేసేందుకు అక్రమంగా గరుసు తరలిస్తున్నారని పోలీసులకు, రెవెన్యూ అధికారులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నియోజకవర్గానికి చెందిన తెదేపా నాయకుడు రాఘవేంద్రరెడ్డి ఆరోపించారు. అధికారం పోయినా అవినీతి ఆగడం లేదని, అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



గరుసును తరలిస్తున్న లారీలు

# ధరలు నియంత్రించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉల్లి, టమోట ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. ధరల నియంత్రణపై ఆయన మంగళవారం కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి కలెక్టరేట్‌లో టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పండగ సమయంలో కూరగాయల ధరలు అసాధారణ రీతిలో పెరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, రైతుబజార్లు, మార్కెట్ కమిటీల కార్యదర్శులు మార్కెట్ యార్డులను సందర్శించి ధరలు నియంత్రణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ధరల వివరాలకు సంబంధించిన నివేదికలను ప్రతిరోజూ తనకు పంపాలని ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్యాపిలి నుంచి రోజూ 3 టన్నుల టమాట తెప్పిస్తున్నామని.. కిలో రూ.40-45 లోపు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉల్లి ధర కిలో రూ.36 ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జేసీ డా.బి.నవ్య మాట్లాడుతూ ఆయిల్ మిల్లర్లు, రిటైలర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి సంప్రదింపులు జరిపామని, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.126, పామాయిల్ రూ.121కు అందిస్తామని అంగీకరించారని చెప్పారు. ఈ టెలీ కాన్ఫరెన్సులో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 99 దుకాణాలు.. 1,501 దరఖాస్తులు



కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్యం దుకాణాలకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. మంగళవారం రాత్రి 7.30 వరకు పరిశీలిస్తే కర్నూలు జిల్లాలో 99 దుకాణాలకు 1,501 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం ఒక్క రోజే 541 వరకు రావడం విశేషం. ఈలెక్కన పరిశీలిస్తే ఒక్కో దుకాణానికి 15 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువు బుధవారం ముగియనుంది. ఈ నేపథ్యంలో 2 వేలు దాటుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 105 దుకాణాలకు మంగళవారం రాత్రికి 1,002 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం ఒక్కరోజే 310 అందాయి. ఈ లెక్కన ఆ జిల్లాలో పరిశీలిస్తే సగటున ఒక్కో దుకాణానికి 10 దరఖాస్తులు వచ్చాయి. నంద్యాల జిల్లాలో దరఖాస్తుల సంఖ్య 1,500 దాటుతాయని అంచనా వేస్తున్నారు. నంద్యాల జిల్లా కంటే కర్నూలు జిల్లాలో మద్యం దుకాణాలు తక్కువ.. అయినా నంద్యాల జిల్లాలో దరఖాస్తులు తక్కువగా రావడం గమనార్హం. కర్నూలు జిల్లాపై తెలంగాణ వ్యాపారుల ప్రభావం అధికంగా ఉన్నట్లు కనిపిస్తోంది. కాగా ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తుల ద్వారానే ప్రభుత్వానికి రూ.70 కోట్లకుపైగా ఆదాయం సమకూరే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

| ఆబ్కారీ స్టేషన్ | దుకాణాలు | దరఖాస్తులు |
|---|---|---|
| కర్నూలు | 31 | 694 |
| కోడుమూరు | 14 | 260 |
| ఆదోని | 12 | 137 |
| ఆలూరు | 9 | 119 |
| ఎమ్మిగనూరు | 15 | 128 |
| కోసిగి | 4 | 31 |
| పత్తికొండ | 14 | 132 |

### కర్నూలులో అత్యధికంగా..

కర్నూలు ఆబ్కారీ స్టేషన్ పరిధిలో అత్యధిక దరఖాస్తులు నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 31 మద్యం దుకాణ అనుమతులకు మంగళవారం రాత్రి వరకు పరిశీలిస్తే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా 694 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన గమనిస్తే సగటున ఒక్కో దుకాణానికి 22 దరఖాస్తులు వచ్చాయి. మరోరోజు గడువు ఉండటంతో మొత్తం దరఖాస్తులు 1,000 దాటొచ్చని అంచనా వేస్తున్నారు.

### బినామీల హవా

కర్నూలు జిల్లాలో మద్యం దుకాణ అనుమతుల దరఖాస్తు నమోదులో బినామీల పర్వం కొనసాగుతోంది. నాయకులు, వ్యాపారులు మద్యం దుకాణ అనుమతులు దక్కించుకునేందుకు వివిధ వ్యూహాలు అనుసరిస్తున్నారు. వైకాపా, తెదేపా ముఖ్య నేతలు తమకు నమ్మకమైన అనుచరులతో దరఖాస్తులు వేయిస్తున్నారు. కర్నూలులో బార్లు నిర్వాహిస్తున్న పాణ్యం నియోజకవర్గ వైకాపా ముఖ్య నేతలు తమ అనుచరులను తెర ముందు ఉంచి దరఖాస్తు చేయించారు. నగరంలోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో మంగళవారం వారి సందడి కనిపించింది. కర్నూలులో రెండు బార్లు నిర్వహిస్తున్న ఓ తెదేపా నగర నాయకుడు ఇటీవల మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ బదిలీల్లో చక్రం తిప్పారు. మళ్లీ నగర పరిధిలోని మద్యం దుకాణాల అనుమతులు కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి గద్వాల జిల్లాకు చెందిన రాజకీయ నేతల అనుచరులు మంగళవారం పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాల్లో తెదేపా వర్గీయుల హవా కొనసాగుతోంది. మండలస్థాయి నాయకులు తమతమ అనుచరులతో దరఖాస్తు చేయిస్తున్నారు. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు నియోజకవర్గాల్లో ఇరు పార్టీల నేతలు పోటీపడి బినామీలతో దరఖాస్తు చేయిస్తున్నారు.

# సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గు ముఖం పట్టింది. మంగళవారం నాటికి 20,365 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. సోమవారం 28,960 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఒక్క రోజులో 8,595 క్యూసెక్కులు తగ్గిందని, బుధవారం నాటికి ఇంకా తగ్గుతుందన్నారు. నాలుగు గేట్లు ఎత్తి నది దిగువకు 17,916 క్యూసెక్కులు, కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

# తప్పొప్పులు 9వ తేదీలోపు సరిచేసుకోండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏవైనా తప్పొప్పులుంటే ఈ నెల 9వ తేదీలోపు సరిచేసుకోవాలని జవహర్ నవోదయ ప్రిన్సిపల్ పద్మావతి మంగళవారం పేర్కొన్నారు. దరఖాస్తులో విద్యార్థుల పేర్లు, ఇతర సమాచారంలో తప్పులుంటే వెబ్‌సైట్‌లో సవరించుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎన్‌వోసీ ఇవ్వండి.. వేరే వర్సిటీ చూసుకుంటాం

## ☛ వీసీకి స్పష్టం చేసిన కళాశాలల ప్రతినిధులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని బీఈడీ కళాశాలల్లో జరిగిన పరీక్షలకు సంబంధించిన ఫలితాల వెల్లడి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆయా కళాశాలల ప్రతినిధులు రెండు రోజుల కిందట రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్‌కు సమస్యను తెలిపారు. గతేడాది డిసెంబరులో జరిగిన రెండో సెమిస్టర్‌కు సంబంధించి ఫలితాలు వెల్లడించినా.. మార్కుల జాబితా ఇవ్వలేదని వీసీ దృష్టికి తెచ్చారు. ఈ ఏడాది మేలో సెమిస్టర్ పరీక్షలు జరగ్గా.. ఈనెల 7న ఫలితాలు ఇచ్చారని తెలిపారు. ఫలితాల విడుదలలో తీవ్ర ఆలస్యం ఎందుకు జరుగుతోందని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ఇన్‌ఛార్జి వీసీని అడిగారు. దీనిపై ఎలాంటి సమాధానం రాకపోవడంతో తమ కళాశాలలకు చెందిన ఎన్‌వోసీలు ఇచ్చేస్తే మరో వర్సిటీలో చేరుతామని ఖరాఖండిగా చెప్పినట్లు సమాచారం. బీఈడీ కళాశాలలకు ఎన్‌వోసీలు ఇచ్చేస్తే డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ వర్సిటీలో చేరేందుకు యాజమాన్యాలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.



# పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం

పోలకల్లు (సి.బెళగల్ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పోలకల్లు గ్రామానికి చెందిన మాదన్న (59) పురుగు మందు తాగి మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చాలా రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. సొంతిల్లులేక ప్రభుత్వ ఆసుపత్రిలో పాడుబడ్డ గదిలో తలదాచుకుంటున్నారు. భార్య చాలా ఏళ్ల కిందట చనిపోయింది. ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నారు. సోమవారం ఇంట్లో పురుగు మందు తాగారు. చుట్టుపక్కలవారు గమనించి 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా మంగళవారం మృతి చెందారు.

# అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఏనుగుబాలకు చెందిన ఏసురాజు (38) సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు మంగళవారం గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. ఆయనకు పొదుపు బుక్‌కీపర్ హంపయ్యకు మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరుగగా ఏసురాజు అస్వస్థతకు గురయ్యారు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. ఆయన భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై పేర్కొన్నారు.

# తెల్లారిన చిన్నారుల బతుకులు

## ☛ ఆటో ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి

## ☛ కుటుంబాల్లో విషాదం నింపిన వేర్వేరు ప్రమాదాలు

తెలతెలవారుతోంది.. సూర్యుడు నెమ్మదిగా ఉదయిస్తున్నాడు.. ఓ వృద్ధురాలు ఒడిలో బాలుడిని పెట్టుకుని రోదిస్తోంది.. లేరా చిన్నా.. అమ్మానాన్న వద్దకు పోదాం. లేరా అంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. బాలుడు శాశ్వత నిద్రలోకి జారుకున్నాడని చెబుతున్నా.. కన్నీటికి అక్కడి వారు అడ్డుకట్టవేయలేకపోయారు. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి తల్లి తల్లడిల్లిపోయింది. ఆటోలో మృతదేహం పక్కనే కూర్చుని విలపించింది. పెద్ద చదువులు చదివి ఉద్యోగం చేస్తావనుకుంటే.. ఇలా చేశావని గుండెలవిసేలా రోదించారు.



బాలుడి మృతదేహం వద్ద కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తల్లి



### నాన్నమ్మతో వెళ్లి..

పెద్దకడబూరు, ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పెద్దకడబూరు మండలం హులికన్వి వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో వీరేశ్(13) అనే బాలుడు మృతిచెందగా.. మరో ఏడుగురు గాయపడిన ఘటన మంగళవారం తెల్లవారు జామున 5.30 గంటలకు జరిగింది. బసలదొడ్డి గ్రామానికి చెందిన ఆటోలో పది మంది ప్రయాణికులతో ఆదోని పట్టణానికి బయల్దేరింది. హులికన్వి గ్రామం వద్దకు చేరుకోగానే రహదారిలో ఓ గుంత ఉండటంతో.. డ్రైవర్ ఆటోను వేగం తగ్గించారు. పత్తి బస్తాల లోడుతో అతి వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. ఆటో బోల్తా పడటంతో బసలదొడ్డి గ్రామానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న వీరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడి నాన్నమ్మ హనుమంతమ్మతో పాటు అదే గ్రామానికి చెందిన ప్యారమ్మ, జగదీశ్వరి, వీరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ రామాంజనేయులు, హనుమంతు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించినట్లు కానిస్టేబుల్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

### ఒక్కగానొక్క కొడుకు..

బసలదొడ్డి గ్రామానికి చెందిన మల్లేశ్, నరసమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలిపనులకు వెళ్తేనే పూటగడుస్తుంది. మల్లేశ్ తల్లి హనుమంతమ్మ నిత్యం ఆదోనిలో కూరగాయలు తెచ్చి గ్రామంలో చిరు వ్యాపారం చేసేది. కూరగాయల కోసం మంగళవారం ఆదోని మార్కెట్‌కు ఆటోలో బయల్దేరారు. పాఠశాలకు దసరా సెలవులు కావడంతో మనవడు వీరేశ్‌ను వెంటబెట్టుకొని వెళ్లారు. ప్రమాదవశాత్తు వీరేశ్ మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం నిండింది. ఒక్కగానొక్క కొడుకు ఆటో ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

### సరిహద్దున విషాద గీతం

హాలహర్వి, న్యూస్‌టుడే: లెక్కకు మించిన ప్రయాణికులు.. సామర్థ్యం లేని వాహనం.. మితిమీరిన వేగం.. వెరసి ఓ బాలుడు విగజీవిగా మారడానికి కారణమయ్యాయి. 25 మందిని క్షతగాత్రులుగా మారారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామం నుంచి ఆస్పరి మండలంలో పత్తి తొలగించేందుకు 30 మందికి పైగా కూలీలు ఆటోలో బయల్దేరారు. దసరా సెలవులు ఉండటంతో పిల్లలు సైతం కూలిపనులకు వెళ్తున్నారు. మంగళవారం మోకా నుంచి బయల్దేరిన ఆటో సరిహద్దుకు చేరుకొనే సమయానికి వాహనం వెనుక టైర్ పేలి బోల్తా పడింది. దీంతో ఆరో తరగతి చదువుతున్న రఘు(13) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు కూలీలు పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన సుమారు 25 మందికి పైగా కూలీలకు గాయాలయ్యాయి. అధిక వేగంతో పాటు వాహనం నిర్వహణ సరిగి లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



మోకా వద్ద ప్రమాద స్థలంలో..

# ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

## పత్తికొండ ఆర్డీవోగా భరత్ నాయక్



ఆర్డీవోను కలిసిన రెవెన్యూ సిబ్బంది

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పత్తికొండ నూతన ఆర్డీవోగా భరత్ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండలం, డివిజన్ అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. 2023 బ్యాచ్‌కు చెందిన ఆయన మొదటగా శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్‌లో పనిచేసి, బదిలీపై పత్తికొండకు వచ్చారన్నారు. గతంలో కర్నూల్ ఎక్సైజ్ డీసీ స్వీగా తాను పనిచేసినట్లు వివరించారు.

## వార్డుల్లో పర్యటించిన పురపాలక కమిషనరు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 19వ వార్డులో పురపాలక కమిషనరు కృష్ణ మంగళవారం పర్యటించారు. కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఆకాశ వంతెన కింద చేపట్టిన పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. ఆయన వెంట తెదేపా నాయకుడు శ్రీనివాస ఆచారి, కార్యకర్తలు రవి, దర్శి, చాంద్‌బాషా, హనుమంతు ఉన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80095 62277
పత్తికొండ: 8008573822

ఆదోని పురపాలక, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలోని ఎస్కేడీ కాలనీ రెండో రోడ్డులో మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయింది. భరింపరాని కంపు కొడుతోంది. **- గోపి, ఆదోని**

**సమాధానం:** ప్రజారోగ్య సిబ్బందితో శుభ్రత పనులు చేయించి సమస్య పరిష్కరిస్తాం. **- కృష్ణ, కమిషనరు, ఆదోని పురపాలక సంఘం**

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: **సమస్య:** గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారితో పాటు, ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో మురుగు కాల్వలు నిండి రోడ్డుపై పారుతోంది. దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నాం. **- గ్రామస్థులు, కోతిరాళ్ల గ్రామం**

**సమాధానం:** ఇళ్ల ఎదుట కాల్వలపై పెద్ద పెద్ద బండలు ఏర్పాటు చేసుకున్నారు. కాల్వలు శుభ్రం చేయడం సమస్యగా మారింది. గ్రామస్థులతో చర్చించి చర్యలు చేపడతాం. **- కె.అంజయ్య, సర్పంచి, కోతిరాళ్ల**

తుగ్గలి, న్యూస్‌టుడే: **సమస్య:** పగిడిరాయి నుంచి మదనంతపురం గ్రామానికి వెళ్లే దారిలో పెద్దబావి వద్ద కల్వర్టు కుంగిపోయింది. ఆయా గ్రామాలకు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. **- వెంకటేశ్, రైతు, పగిడిరాయి**

**సమాధానం:** సమస్యను సర్పంచితో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- రాజానాయక్, పంచాయతీ కార్యదర్శి, పగిడిరాయి**

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: **సమస్య:** మా కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే రాకపోకలు సాగించడం కూడా కష్టంగా ఉంటుంది. **- రాము, భరత్ నగర్, మండిగిరి**

**సమాధానం:** కాలనీలో నెలకొన్న సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం. **- చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, మండిగిరి (ఆదోని)**

హొళగుంద, న్యూస్‌టుడే: **సమస్య:** నెరణికి గ్రామ ప్రధాన రహదారిలోని మురుగు కాల్వలో చెత్తాచెదారం, వ్యర్థాలతో మురుగు పారక దుర్వాసన వస్తోంది. **- మల్లికార్జున, నెరణికి**

**సమాధానం:** పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. **- షఫీ, పంచాయతీ కార్యదర్శి**

## బన్ని ఉత్సవంలో హింస వద్దు

హొళగుంద, న్యూస్‌టుడే: దసరా పండగ రోజున నిర్వహించే బన్ని ఉత్సవాన్ని హింసతో కాకుండా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్ హొళగుంద ఎస్సై చంద్ర అన్నారు. విరుపాపురం, బిలేహాల్ గ్రామాల్లో బన్ని ఉత్సవాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

## మానసిక ఒత్తిడికి లోనుకావద్దు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసులు విధినిర్వహణలో సమయంలో మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా విధులు నిర్వహించాలని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టరు భాస్కర్, ఆదోని డీఎస్పీ సోమన్న అన్నారు. ఆదోని రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినం పురస్కరించుకొని పోలీసు సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు సూర్యమోహనరావు, శ్రీరామ్, వైద్యులు శ్రీనివాసనాయక్, సత్యవతి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్, ఆదోని డీఎస్పీ సోమన్న తదితరులు

# నాటి పొరపాటు.. విద్యార్థులకు గ్రహపాటు

☛ అసంపూర్తిగానే ప్రహరీలు

☛ పాఠశాల ఆవరణలో విషపురుగులు, పశువుల సంచారం



### గ్రామానికి దూరంగా..

ఆలూరు మండలం హుళేబీడు ఉన్నత పాఠశాల ఇది. 6 నుంచి 10వ తరగతి వరకు 360 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2011లో ప్రాథమిక పాఠశాలను ఉన్నత స్థాయికి పెంచారు. అప్పట్లో ప్రత్యేకించి భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాల గదుల్లోనే నిర్వహిస్తూ వచ్చారు. తర్వాత గ్రామానికి దూరంగా ఆదోని వెళ్లే మార్గంలోని కొండ ప్రాంతంలో స్థలం కేటాయించి భవన నిర్మాణం చేపట్టారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టలేక పోయారు. అసలే పాఠశాల గ్రామానికి దూరంగా ఉండటం, ప్రహరీ లేకపోవడంతో భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ఆవరణలో పశువులు, జంతువులు, విష పురుగులు సంచరిస్తున్నాయి. ప్రస్తుతం పాఠశాలకు విలువైన పరికరాలు, కంప్యూటర్లు అందించారు. రాత్రిళ్లు ఆకతాయులు పాఠశాలలోకి చొరబడే ప్రమాదం లేకపోలేదు. ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆలూరు, న్యూస్‌టుడే: పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో కొంత మంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్లు కొంత మంది పాఠశాలల ఆవరణలోనే మద్యం తాగి సీసాలతో పాటు గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు అక్కడే వేసి వెళ్తున్నారు. ప్రహరీలు లేకపోవడంతో చోరీలు జరిగేందుకు అవకాశాలు లేకపోలేదు. గతంలో కొన్ని పాఠశాలల్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి పరికరాలు ఎత్తుకెళ్లిన సందర్భాలూ లేకపోలేదు. కొన్ని చోట్ల పాఠశాల సమయంలోనే పశువులు, కుక్కలు, పందులు వంటివి ఆవరణలో సంచరిస్తున్నాయి. ఆలూరులోని కస్తూర్బా పాఠశాల వద్ద ప్రహరీని అసంపూర్తిగా వదిలేయడంతో విష పురుగుల భయం నెలకొంది. పాఠశాల పట్టణానికి దూరంగా మొలగవల్లి వెళ్లే మార్గంలో నిర్మించారు. పాఠశాల వెనుక వైపు ముళ్లకంపలు పెరిగిపోవడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### ఇదీ పరిస్థితి..

ఆలూరు మండలంలో పది ప్రభుత్వ ఉన్నత, 34 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా, ఆదర్శ, గిరిజన బాలికలు, బాలుర ఆశ్రమ, అరికెర గురుకుల పాఠశాలలు ఉన్నాయి. చాలా పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరి కొన్ని పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టినా మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. గతంలో పాఠశాలలు నిర్మించినా ప్రహరీలు మాత్రం నిర్మించలేకపోయారు. మండలంలోని హుళేబీడు, హత్తిబెళగల్ ఉన్నత, మొలగవల్లి కొట్టాల, మొలగవల్లి ఆదిఆంధ్ర, కరడిగుడ్డం, అరికెరతండా, గోనేహాల్, కాత్రికి, పెద్దహోతూరు ఆదిఆంధ్ర, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవు. ఆలూరులోని కస్తూర్బా, కోయనగర్ ప్రాథమిక పాఠశాలల వద్ద ప్రహరీ గోడల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి.



ఆగిన ఆలూరు ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం

## వృత్తివిద్యా కోర్సులతో మెరుగైన అవకాశాలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వృత్తివిద్యా కోర్సులతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఉంటాయని వొకేషనల్ సమన్వయకర్తలు కమలాకర్, విక్రమ్ అన్నారు. వెల్దుర్తి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివిధ చేతి వృత్తులు, స్వయం ఉపాధి దుకాణాల పనితీరును వివరించారు.

## వైద్యసేవలపై ఆరా

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో రెండు ప్రైవేటు ఆసుపత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మదర్ ఆస్పత్రితో పాటు వంశీ చైతన్య ఆస్పత్రులను పరిశీలించి ఆరోగ్యశ్రీ ద్వారా అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. అక్కడి నుంచి ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిని తనిఖీ చేసి, బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట మాధవిలత, జిల్లా ఆరోగ్యశ్రీ ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయకర్త భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టరు సత్యవతి, ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టరు మాధవిలత ఉన్నారు.

# బ్రహ్మచారిణి.. శక్తిరూపిణి

దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారి విగ్రహాలకు వివిధ అలంకరణలు చేశారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం చేపట్టారు. అభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు నిర్వహించారు. పలు చోట్ల నోట్లతో ఆకర్షణీయంగా అలంకరించారు. - న్యూస్‌టుడే, బృందం



ఆదోనిలో ఉలన్ దారాలతో లక్ష్మమ్మవ్వకు అలంకరణ



ఆదోనిలో అంబాభవాని రథోత్సవంలో భక్తులు



పత్తికొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మీదేవి అలంకరణ



దేవనకొండ: కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో మహిళల కోలాటం



ఆస్పరి మండలం జోహరాపురంలో పెద్దమ్మవ్వ లక్ష్మీదేవి దర్శనం



కృష్ణగిరి: కటారుకొండలో రూ.లక్ష విలువైన నోట్లతో మహాలక్ష్మీదేవి



రామతీర్థం గాయత్రీదేవి ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

## బీసీలు రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలి

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: బీసీలు రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని.. అప్పుడు అణిచే పరిస్థితి నుంచి శాసించే స్థాయికి చేరుతామని ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి అన్నారు. ఆదోని బీసీ ఫెడరేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం స్థానిక మంగళ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా గౌరవాధ్యక్షుడు సాయిబాబా, ప్రధాన కార్యదర్శి రామచంద్ర ఆచారి, పక్కీరప్ప, మాన్వి దేవేంద్రప్ప, ఈశ్వరప్ప, శేషప్ప, షేక్షావలి, బండారి రాజేశ్వరప్ప, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథి

## మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

కృష్ణగిరి, న్యూస్‌టుడే: కృష్ణగిరి మండలంలోని [illegible] రంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

## ప్రభుత్వ న్యాయవాది సిద్దప్పకు సన్మానం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా సిద్దప్పను నియమించారు. న్యాయవాదులు వాయుజీవోత్తమరావు, వలి, ప్రవీణ్‌కుమార్, జనార్దన్, విజయభాస్కర్, వీరేష్, రాజగోపాల్‌నాయుడు తదితరులు ఆయనను మంగళవారం సత్కరించారు



సిద్దప్పను సత్కరిస్తున్న న్యాయవాదులు

## ప్రజలకు అందించే సేవలతో గుర్తింపు

ఆస్పరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలతో గుర్తింపు వస్తుందని ఎంపీడీవో గీతావాణీ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి ఆధ్వర్యంలో ఆస్పరి మండలంలో పని చేసి బదిలీపై వెళ్తున్న ఉప తహసీల్దారు గాయత్రీ, ఏఈలు యమునప్ప, నరేష్, కార్యదర్శులు వీరేష్, చిన్న వెంకటేష్, వీఆర్వో వాణీశ్రీని మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివశంకర్ నాయక్, సర్పంచులు తోయజాచ్చప్ప, హరికృష్ణ, నాయకులు రామాంజనేయులు, రాఘవేంద్ర, బసవరాజు, మల్లికార్జురెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సుజాత, ప్రశాంత్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



బదిలీ అయిన అధికారులను సన్మానిస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ, సర్పంచులు

## ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా హాజీమియా



హాజీమియా

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌గా హాజీమియా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. డోన్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తూ బదిలీ అయ్యారు.

## మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

☛ ఒక్కరోజే 80కి పైగా దాఖలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల నిర్వహణకు లాటరీ పద్ధతిలో 2024-25 సంవత్సరానికి కేటాయించేందుకు ఈ నెల 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. పత్తికొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు స్టేషన్ పరిధిలోని 14 దుకాణాలకు ఇప్పటి వరకు 130 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ విశ్వేశ్వరావు తెలిపారు. వారం రోజులుగా మందకొడిగా సాగిన దరఖాస్తుల స్వీకరణ గడువు సమీపిస్తుండటంతో ఒక్కసారిగా ఊపందుకుంది. మంగళవారం ఒక్క రోజే 80కి పైగా దరఖాస్తులు అందినట్లు సీఐ చెప్పారు. బుధవారం ఒక్కరోజే గడువు ఉండంతో ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన అన్నారు. ఆన్‌లైన్ విధానం కాబట్టి ఎక్కడినుంచైనా దరఖాస్తు చేయవచ్చన్నారు.

**ఆదోనిలో పోటాపోటీగా..**

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో ఎక్సైజ్ మద్యం దుకాణాల నిర్వహణ కోసం గుత్తేదారులు పోటాపోటీగా దరఖాస్తులు చేస్తున్నారు. ఆదోని పట్టణంలో 8, గ్రామీణ ప్రాంతంలో 2 మద్యం దుకాణాల నిర్వహణ కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు గుత్తేదారుల నుంచి టెండర్లను ఆహ్వానించింది. ఒక్కో టెండరు దాఖలకు రూ.2 లక్షల ధరావతు విధించారు. మంగళవారం సాయంత్రం నాటికి గుత్తేదారుల నుంచి 136 టెండర్లు దాఖలు చేసినట్లు ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. బుధవారం ఆఖరి రోజు కావడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## ఆదోని ఎమ్మెల్యే విధానాలు నచ్చకే పార్టీకి రాజీనామా

☛ మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: తాను పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డానని. . ఆదోని ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టరు పార్థసారథి గెలుపు కోసం కృషి చేసిన వారిని పట్టించుకోకుండా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని.. ఆయన విధానాలు నచ్చక తాను భాజపా పార్టీకి రాజీనామా చేస్తున్నానని భాజపా అన్య భాష రాష్ట్ర కన్వీనరు, మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ వెల్లడించారు. కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు భాజపా జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సోదరుడు కునిగిరి నాగరాజు ఎమ్మెల్యే టికెట్ కోసం రూ.3 కోట్లకు డీల్ చేసిన ఆడియో వైరల్‌గా మారినా.. భాజపా అధిష్ఠానం వారికి షోకాజ్ నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఏదైనా పనులు కావాలంటే ఎమ్మెల్యే బినామీగా ఉన్న ఓ వైద్యుడి వద్దకు వెళ్లి సమస్యను విన్నవించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుసరిస్తున్న విధానాలు నచ్చకనే భాజపాకు రాజీనామా చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌జైన్

### వాటాలకు అలవాడు పడినందుకే సస్పెన్షన్

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకుడు ప్రకాశ్‌జైన్ 60:40 శాతం వాటాలకు అలవాటు పడి, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు దేశాయి చంద్రన్న, జిల్లా ఇన్‌ఛార్జి అంకారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానికంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు నుంచి భాజపాకు వ్యతిరేకంగా ప్రకాశ్‌జైన్ పనిచేస్తూ వచాచరన్నారు. పార్టీపై, ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథిపై విమర్శలు చేస్తూ వచ్చారన్నారు. ఇప్పటికైనా ప్రకాశ్‌జైన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ అసెంబ్లీ కన్వీనరు శ్రీరాములు, కోకన్వీనరు నాగరాజుగౌడు, రసాళే గోవిందరావు పాల్గొన్నారు.

## పల్లె కబుర్లు

సంతేకూడ్లురు(ఆదోని నేరవార్తలు), న్యూస్‌టుడే: సంతేకూడ్లురు గ్రామంలో చెట్టు తొలగింపు విషయంలో గంగప్ప అనే వ్యక్తిపై దాడి చేసిన ఈశ్వర్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర తెలిపారు.

బొయినపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: బొయినపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్న సాలమ్మ అనే మహిళను ఎస్సై అశోక్ మంగళవారం అరెస్టు చేశారు. ఆమె నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

సాంబగల్(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: సాంబగల్ గ్రామానికి చెందిన సుంకమ్మ అనే మహిళపై పొలం విషయంలో అదే గ్రామానికి చెందిన రాజు దాడి చేసినట్లు ఆదోని తాలుకా ఎస్సై రామాంజనేయులు మంగళవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇస్వీ(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: ఇస్వీ గ్రామానికి చెందిన ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర మంగళవారం తెలిపారు. ఓ ఇస్వీ గ్రామానికి చెందిన మల్లికార్జున ఫిర్యాదు మేరకు హుసేని, దేవేంద్ర, దేవదానంపై కేసు నమోదు చేశామన్నారు. అదేవిధంగా ఇస్వీ గ్రామానికి చెందిన ఉశేని ఫిర్యాదు మేరకు మల్లికార్జున, పవన్‌కుమార్, ఈరన్న, వంశీలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నెరణికి(హొళగుంద), న్యూస్‌టుడే: నెరణికి గ్రామంలో అనుమానిత ఇళ్లలో మంగళవారం ఆలూరు సీఐ శ్రీనివాస నాయక్, ఆధ్వర్యంలో ఆలూరు పరిధిలోని ఎస్సైలు, పోలీసులు సోదాలు చేపట్టారు. నెరణికి గ్రామంలోని కొండల్లో 150 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. బోయ రవి, హొసళ్లి శ్రీరాములు పారిపోయారని హొళగుంద ఎస్సై బాల నరసింహులు మంగళవారం తెలిపారు.

## చెత్తబుట్టలు.. స్వచ్ఛ బాటలు



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి అందించే చెత్తబుట్టలు ఆలూరు చేరుకున్నాయి. స్థానిక మండల పరిషత్తు సమావేశ భవనంలో మంగళవారం వాటిని భద్రపరిచారు. మండలానికి మొత్తం 20 వేల చెత్త బుట్టలు వచ్చాయాని మండల పరిషత్తు అధికారులు తెలిపారు. త్వరలోనే చెత్త బుట్టలు ఇంటింటికి అందిస్తామన్నారు. తడి, పొడి చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తబుట్టల్లో వేసి గ్రామ పంచాయతీకి చెందిన రిక్షాలు, ట్రాక్టర్లు వచ్చిన సమయంలో అందులో వేయాలని వారు తెలిపారు. - న్యూస్‌టుడే, ఆలూరు

## ప్రమాదాలు జరిగినా.. అదే ప్రయాణం

మద్దికెర ప్రాంతం నుంచి సరకు రవాణా చేసే వాహనాల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. గతంలో ఆటోలో మిరప కోతకు వెళ్లిన కూలీలు కోతులమాను వద్ద వాహనం అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళా కూలీలు మృతిచెందారు. వివాహాది శుభకార్యాలతో పాటు, పొలాల్లో పనిచేసేందుకు సామర్థ్యం మించి ప్రయాణిస్తున్నారు. మద్దికెర మీదుగా పలు వాహనాలు ఇలా అధిక సంఖ్యలో ప్రయాణికులతో ఎలాంటి భద్రత లేకుండా రాకపోకలు సాగిస్తున్నారు. - న్యూస్‌టుడే, మద్దికెర



ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు


వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

## చేనేతలకు విద్యుత్తు బిల్లులో రాయితీలివ్వాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు విద్యుత్తు బిల్లులో రాయితీలివ్వాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగుడే మాధవ స్వామి డిమాండు చేశారు. విద్యుత్తు ఉపకేంద్రంలో మంగళవారం ఏఈ మధుసూదన్‌కు వారు వినతిపత్రం అందించి మాట్లాడారు. విద్యుత్తు రాయితీ జీవోను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శ్రీనివాసులు, విజయ్, రాజు, తోటయ్య ఉన్నారు.

## బోధనేతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

నందవరం, న్యూస్‌టుడే: నందవరం కస్తూర్బా బాలిక విద్యాలయంలో పొరుగు సేవల విధానంలో నాలుగు బోధనేతర ఉద్యోగాలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నందవరం కస్తూర్బాలో హెడ్ కుక్, స్కావెంజర్, స్వీపర్, డేఅండ్‌నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఒక్కోటి ఖాళీ ఉన్నాయన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM) ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794 కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు: సమస్య: మండలంలోని మేకడోన గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కాల్వలు శుభ్రం చేయించగలరు. - గ్రామస్థులు

సమాధానం: పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. - జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

## పారదర్శకత పాటించాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పంటల నమోదులో పారదర్శకత తప్పనిసరి అని తహసీల్దార్ శ్రీనాథ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నౌలేకల్, పెద్దకడబూరు పంట పొలాలు పరిశీలించి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. పంట నమోదు పారదర్శకంగా నిర్వహిస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏవో వరప్రసాద్ ఉన్నారు.

## గోవిందమ్మ దీక్ష భగ్నం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరుతూ పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మ ఎమ్మిగనూరులో సోమప్ప కూడలిలో దీక్ష చేపట్టారు. ఆమెకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీక్ష విరమించాలని పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. అయినా విరమించకపోవడంతో పోలీసులు గోవిందమ్మను ప్రత్యేక వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రజా సంఘాల నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

# గ్రేడింగ్ యంత్రం.. నిరుపయోగం

☛ వినియోగంలోకి తెస్తే రైతులకు ప్రయోజనం

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెగ్యులర్ మార్కెట్లు ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు యార్డుల్లో ఈ-నామ్‌లో భాగంగా యంత్రాలను మంజూరు చేశారు. ఒక్కోటి రూ.56 లక్షల చొప్పున మూడు మార్కెట్లలో రూ.1.68 కోట్లతో గ్రేడింగ్ యంత్రాలను ఏర్పాటు చేసింది. రైతులు వాతావరణ పరిస్థితుల కారణంగా కల్లంలో పంట ఉత్పత్తులను సరిగా శుభ్రత చేయలేని పరిస్థితి. దీంతో మార్కెట్‌కు కల్లం నుంచి నేరుగా విక్రయానికి తెస్తారు. దిగుబడుల్లో చెత్తాచెదారం, రాళ్లు, మట్టి వంటి వాటిని గ్రేడింగ్ యంత్రం ద్వారా శుభ్రం చేస్తారు. దీంతో రైతులకు మంచి ధర లభించనుంది.

కర్నూలు మార్కెట్లో గ్రేడింగ్ యంత్రాన్ని వినియోగంలోకి తెచ్చారు. ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్లో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఈ యంత్రాల ద్వారా వేరుశనగ, కందులు, శనగలు, జొన్నలు వంటి ఉత్పత్తులను గ్రేడింగ్ చేయొచ్చు. పంట ఉత్పత్తులను బట్టి జల్లెడలను మార్చుకుంటే సరిపోతుంది. యంత్రం ద్వారా పెద్దగా వ్యయప్రయాసలు లేకుండా దిగుబడులను ఒక చోట పోస్తే శుభ్రం చేసి సంచుల్లో నింపి అదే ప్యాకింగ్ చేసేస్తుంది. గంటకు 3 నుంచి 5 టన్నుల దిగుబడులను శుభ్రం చేసే సామర్థ్యం యంత్రానికి ఉంది. దిగుబడులను శుభ్రం చేసినందుకు రైతుల నుంచి నామమాత్రపు రుసుము వసూలు చేస్తారు.


రూ.56 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రేడింగ్ యంత్రం

### అవగాహన లేక నష్టం

రైతులు పంట దిగుబడులను శుభ్రం చేయకపోవడంతో వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటా గరిష్ఠ ధర రూ.7 వేలకుపైగా ఉంటే, ఉత్పత్తులు నాణ్యంగా ఉన్నా రూ.5 వేల నుంచి రూ.6 వేల లభిస్తోంది. రైతులు క్వింటాలుకు రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు నష్టపోతున్నారు. రెగ్యులర్ మార్కెట్ యార్డుల్లో ఏడాదికి సుమారు రూ.500 కోట్ల నుంచి రూ.800 కోట్లకుపైగా వరకు వేరుశనగ, కందులు, వాము, శనగలు వంటివి వ్యాపారం జరుగుతుంది. శుభ్రం చేయడం వల్ల మంచి ధర లభిస్తుంది. ఎక్కువ శాతం మంది చిన్న, సన్నకారు రైతులు కావడం, దిగుబడులు అంతంత మాత్రమే ఉండటం వల్ల గ్రేడింగ్ చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. అధిక దిగుబడులు తెచ్చే రైతులు కూడా గ్రేడింగ్ చేసుకోకుండానే విక్రయిస్తున్నారు. గ్రేడింగ్ చేయడం వల్ల రైతుకు కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించాల్సి ఉంది.

### గుత్తేదారులు ముందుకొస్తే అందజేస్తాం

– నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు

ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్లో గుత్తేదారులు ముందుకు వస్తే యంత్రాలను అందజేస్తాం. ఇంతకుముందే టెండర్ వేసినా గుత్తేదారులు ముందుకు రాలేదు. మరోసారి టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటాం. యంత్రాల లబ్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తాం.

## ఆర్టీసీకి పూర్వ వైభవం తెస్తాం: బీవీ


కొత్త బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్టీసీ ద్వారా కొత్త బస్సులు ఏర్పాటు చేసి సంస్థకు పూర్వ వైభవం తెస్తామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్టీసీలో కొత్తగా నాలుగు బస్సులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో ఇప్పటికే 8 బస్సులను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఎమ్మిగనూరు-కర్నూలు రహదారికి కోడుమూరు వరకు పడిన గుంతలను పూడ్చేందుకు నిధులు మంజూరయ్యాయని, ఈ నెల 16న టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం అమర్నాథ్, తెదేపా నాయకులు గట్టు అల్తాఫ్, రంగస్వామిగౌడ్, రాందాస్‌గౌడ్, కొండయ్యచౌదరి, ప్రతాప్ ఉరుకుందయ్యశెట్టి, నరసింహులు పాల్గొన్నారు.

## సెలవుల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: దసరా పండగ సెలవుల సందర్భంగా గ్రామాలకు వచ్చిన చిన్నారులపై తల్లిదండ్రులు, సంరక్షకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గోనెగండ్ల సీఐ గంగాధర్ మంగళవారం సూచించారు. మండలంలో చెరువులు, కాలువలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈత సరదా కోసం పిల్లలు వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు.

## అడుగేస్తే.. ఆసుపత్రికి చేరాల్సిందే



నందవరం ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. ఇటీవల వర్షం కురవడంతో బురదగా మారి రాకపోకలకు నరకం చూపుతోంది. ఈ మార్గంలో ముగతి, నందవరం, నాగలదిన్నె మీదగా తెలంగాణ రాష్ట్రానికి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండలంలోని ముగతి గ్రామ సమీపంలో రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిలో వందల సంఖ్యలో అయిజ, గద్వాల, మహబూబ్‌నగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. ఇప్పటికైనా ఈ దారిని బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నందవరం

## పెద్ద గుంత.. చూడకుంటే ప్రాణాలు గోవిందా



మండలంలోని కైరవాడిలో ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారిలో రోడ్డు దెబ్బతిని మూడడుగుల లోతులో పెద్ద గుంత పడింది. గోనెగండ్ల, వేముగోడు, కైరవాడి, ఎర్రబాడు, ఎమ్మిగనూరు గ్రామాల సమీపాల్లో రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఈ దారిలో గంటకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. కైరవాడిలో రహదారిలోని గుంత దగ్గర రాళ్లను సూచిక పెట్టారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోనెగండ్ల

## కాలు పెట్టలేం.. కార్యాలయంలోకి వెళ్లలేం



ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రవేశ ద్వారంలో వాహనదారులు వాహనాలన్నింటిని అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో కార్యాలయానికి రిజిస్ట్రేషన్ నిమిత్తం వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం ఆవరణలో ఇష్టారాజ్యంగా వాహనాలు నిలుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా వారు స్పందించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

## బృందావన ప్రతిమకు సువర్ణ పల్లకి సేవ


శ్రీమఠం ప్రాకారంలో సువర్ణ పల్లకి సేవలో భక్తులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: బృందావన ప్రతిమకు భక్తులు సువర్ణ పల్లకి సేవ నిర్వహించారు. మంగళవారం శ్రీమఠంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించి బంగారు, నవరత్న కవచాలు, వివిధ రకాల పూలతో అలంకరించి మంగళహారతి ఇచ్చారు. సువర్ణ పల్లకిలో రాఘవేంద్రస్వామి వెండి బృందావన ప్రతిమను ఉంచి శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు.

## ప్రతి రైతూ ఈకేవైసీ చేయించుకోవాలి: జేసీ


గంజహళ్లిలో పత్తి పంట పరిశీలిస్తున్న జేసీ నవ్య

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రతి రైతు పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేయించుకోవాలని సంయుక్త కలెక్టర్ నవ్య సూచించారు. మంగళవారం ఆమె గోనెగండ్ల మండలం గంజహళ్లిలో ఈ-పంట నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంట నమోదు చేయించుకోవడంతో వాతావరణ పరిస్థితులతో నష్టపోయినపుడు పరిహారం పొందేందుకు, దిగుబడులు విక్రయించేందుకు దోహదపడుతుందన్నారు. జేసీ వెంట తహసీల్దార్ కుమారస్వామి, ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత ఉన్నారు.

**కోడుమూరులో..** కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ పంట నమోదును జిల్లా జేసీ నవ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెంకటగిరి గ్రామంలో మంగళవారం జేసీ కంది, ఉల్లి పంటలను పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్ నాయక్, ఏవో రవిప్రకాశ్ పంటల వివరాలను జేసీకి వివరించారు.

**నందవరంలో..** నందవరం, న్యూస్‌టుడే: రైతులకు ఈ-పంట నమోదు పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నందవరం తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పంట నమోదు పొలాల పరిశీలన


పంట నమోదు చేసిన పొలాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు రెవెన్యూ పరిధిలో పంట నమోదు చేసిన మిరప, కంది తదితర పొలాలను మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. ఎంత మేరకు పంటలు సాగు చేశారు, వివరాలు ఎంత నమోదు చేశారు తదితర వివరాలను వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉప తహసీల్దార్ వీరేంద్రగౌడ్ ఉన్నారు.

## నవంబరు 15 వరకు శనగ విత్తుకోవడానికి అనుకూలం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో శనగ విత్తుకోవడానికి అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు అనుకూలమని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు-శాస్త్రవేత్తలు ముఖాముఖి నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో శశిధర్‌రెడ్డి, శాస్త్రవేత్త నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మెలకువలతో సస్యరక్షణ

పోలకల్ (సి.బెళగల్), న్యూసుటుడే: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, వ్యవసాయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యల గురించి ఏడీఏ సాలురెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం ఆయన పోలకల్ గ్రామంలో ఏవో మల్లేశ్‌కుమార్‌తో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు రాయితీపై శనగపప్పు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది భరత్, అఫ్రాన్ వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.

## మిరపలో తెల్లదోమ గుర్తింపు

కోసిగి, న్యూస్‌టుడే: ప్రస్తుతం మిరప పంటలో తెల్ల దోమను గమనించామని, నివారణకు ఎకరానికి నీలిరంగు, పసుపు రంగు అట్టలు 20 పెట్టాలని ఏవో రాజు సూచించారు. మంగళవారం ఆయన కోసిగి, చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు పంట నమోదు, ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. బిందుసేద్యం పరికరాలు కావాల్సినవారు రైతుసేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఎంఐపీ నాగరాజు, సిబ్బంది రవీంద్ర, రాజశేఖర్, పవిత్ర ఉన్నారు.


కోడుమూరు గ్రామీణం: అంబాభవాని ఆలయంలో గౌరీదేవిగా అమ్మవారు


కౌతాళం: ఉప్పరహాల్ గ్రామంలో మహాలక్ష్మిగా గ్రామదేవత


సి.బెళగల్: ధనలక్ష్మి రూపంలో వాసవీమాత


గూడూరు గ్రామీణం: కె.నాగలాపురంలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

# ధనలక్ష్మి రూపం.. దుర్గా దర్శనం

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల్లో అమ్మవారు మంగళవారం ధనలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. కరెన్సీ నోట్లతో అమ్మవారిని అందంగా అలంకరించారు. - న్యూస్‌టుడే బృందం


ఎమ్మిగనూరు: పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయంలో కరెన్సీ నోట్లతో..


ఎమ్మిగనూరు: అంబాభవాని దేవాలయంలో కాళీమాత


ఎమ్మిగనూరు గ్రామీణం: అమ్మవారిని దర్శించుకుంటున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


ఎమ్మిగనూరు గ్రామీణం: చేనేత మైదానంలో నగదుతో అలంకరించిన అమ్మవారు


గోనెగండ్ల: గాజులదిన్నె శివారులో పొలమేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

## గంజాయి నిందితుల అరెస్టు

సి.బెళగల్, న్యూసుటుడే: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో మంగళవారం రైతు భూపతిరాముడు మిరప పంటలో సాగు చేసిన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సి.బెళగల్ ఎస్సై తిమ్మారెడ్డి పేర్కొన్నారు. సాగుకు సి.బెళగల్ గ్రామానికి చెందిన మాల హనుమంతు గంజాయి విత్తనాలు అందించారన్నారు. 6.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఆయన వివరించారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

మాధవరం (మంత్రాలయం), న్యూస్‌టుడే: కర్ణాటక మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు మాధవరం ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. కర్ణాటక నుంచి వస్తున్న బస్సును మంగళవారం మాధవరం నాలుగు రోడ్ల కూడలిలో పోలీసు సిబ్బందితో తనిఖీ చేయగా పెద్దకడబూరు మండలం పులికనుమ గ్రామానికి చెందిన మస్కి లక్ష్మన్న రెండు సంచుల్లో మద్యం తీసుకువస్తున్నట్లు గుర్తించామన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని లక్ష్మన్నపై కేసు నమోదు చేసి ఎమ్మిగనూరు కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు. కోర్టు 14 రోజుల రిమాండు విధించగా ఆదోని సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై వివరించారు.

## స్నానానికి వెళ్లి భక్తుడి గల్లంతు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయంలోని తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లిన కర్ణాటక భక్తుడు గల్లంతయ్యారు. కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లా ద్వారగనహల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయప్ప (45) కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాఘవేంద్ర స్వామి దర్శనానికి వచ్చారు. మధ్యాహ్నం నదిలో స్నానానికి వెళ్లి నీటిలో గల్లంతయ్యారు. గజ ఈతగాళ్లతో వెతికించినా ఆచూకీ లభ్యం కాలేదు.

## మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు ఆబ్కారీ శాఖ కార్యాలయం పరిధిలో మంగళవారం నాటికి 14 మద్యం దుకాణాలకు 230 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ మంజుల తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని ఆమె పేర్కొన్నారు.

## చెత్త నిల్వతో ఎరువులు తయారు చేయండి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కంపోస్టు యార్డులోని చెత్త నిల్వలో గాజులు, ఇతర వ్యర్థాలు వేరే చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి ఆదేశించారు. మంగళవారం సోగనూరు రోడ్డులో పేరుకుపోయిన చెత్త నిల్వలను పరిశీలించి పనులు చేపట్టేందుకు గుత్తేదారుడికి అప్పగించారు. పనుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ మదన్, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## గృహ సందర్శన తప్పనిసరి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లోని ఆశా కార్యకర్తలు రోగుల గృహాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన పెద్దకడబూరు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. విటమిన్ ఏ ద్రావణం, ఐరన్ సిరప్, బాలింతల వివరాలను ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల వైద్యాధికారిణి ఫిరదౌసి, వేణుగోపాల్, కిశోర్‌కుమార్, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

## వృత్తి విద్యపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నందవరం, న్యూస్‌టుడే: వృత్తి విద్యపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శివరాం పేర్కొన్నారు. మంగళవారం నందవరంలో వృత్తి విద్యపై విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. జడ్పీ పాఠశాల విద్యార్థులు వివిధ ఎలక్ట్రానిక్స్ మరమ్మతు కేంద్రాలను పరిశీలించారు. ఒకేషనల్ కోఆర్డినేటర్ కృష్ణచైతన్య మాట్లాడుతూ.. కేవలం పాఠ్యపుస్తకాల్లోని జ్ఞానానికిమించి నిజజీవితంలో ఎలక్ట్రానిక్స్ పరికరాల మరమ్మతులు ఎలా చేయాలో తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, జగదీశ్, ఖాజాహుసేని, వృత్తి విద్యా ఉపాధ్యాయులు శివకృష్ణ యాదవ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## ఆసుపత్రి స్టాఫ్‌నర్స్‌పై చర్యలు తీసుకోవాలి

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్స్ రాఘవేంద్ర ప్రసవాలకు వచ్చిన బాధితుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ


డీఐవో నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెదేపా నాయకులు

డీఐవో నాగప్రసాద్‌కు తెదేపా నాయకులు వినతిపత్రం అందజేశారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సమావేశానికి నాగప్రసాద్ హాజరయ్యారు. దీంతో ఆయన్ని తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, వక్రాణి వెంకటేశ్, రామకృష్ణ, అయ్యన్న, తాయన్న కలిసి మాట్లాడారు. అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న స్టాఫ్‌నర్స్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈరయ్యా, గుండేష్, నర్సన్న, బస్సయ్యా, వీరేష్, సీతారాం పాల్గొన్నారు.

# వసతికి అందని సామగ్రి

☛ సరఫరాకాని బెడ్‌షీట్లు, పేరుకుపోయిన కాస్మొటిక్ ఛార్జీలు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం నియోజకవర్గంలో బాలుర, కస్తూర్బా వసతి గృహాల్లో మొత్తం 1,507 మంది విద్యార్థులున్నారు. వారందరికీ ప్రభుత్వం నుంచి ప్రతి నెలా కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించాలి. వీటితోపాటు ఏడాదికొకసారి బెడ్‌షీట్లు, కొత్తగా వసతి గృహంలో చేరినవారికి ట్రంకు పెట్టెలు ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంటుంది. గత వైకాపా పాలనలో వసతి గృహ విద్యార్థులకు ఇవేవీ అందించకుండా కాలం వెళ్లదీశారు. బీసీ బాలుర వసతి గృహాల్లో విద్యార్థులకు 2023 నవంబరు నుంచి కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించలేదు. బెడ్‌షీట్లు, ట్రంకు పెట్టెలు, పళ్లాలు, గ్లాసులు సరఫరా చేయలేదు. కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు మూడేళ్లుగా కాస్మొటిక్, బెడ్‌షీట్లు, ట్రంకు పెట్టెలు, పళ్లాలు, గ్లాసులు అందలేదు.

వర్షాకాలం పూర్తవుతోంది. కొద్ది రోజుల్లో చలికాలం ప్రారంభమవుతుంది. విద్యార్థులకు దుప్పట్లు అందించాల్సిన సమయం. ఈ ఏడాది ఇంత వరకు ఎలాంటివి అందించలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, విద్యా శాఖ తగిన చర్యలు తీసుకుని వాటిని సరఫరా చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. నియోజకవర్గంలో బాలుర వసతి గృహాల్లో 535 మంది, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో 972 మంది విద్యార్థినులున్నారు. వీరికి 2,996 బెడ్‌షీట్లు రావాల్సి ఉంది. కాస్మొటిక్ ఛార్జీలు రూ.24.71 లక్షలకుపైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

| మండలం | బాలుర వసతి గృహం (విద్యార్థులు) | కస్తూర్బా పాఠశాల (విద్యార్థినులు) | రావాల్సిన బెడ్‌షీట్లు | కాస్మొటిక్ ఛార్జీల బకాయిలు |
|---|---|---|---|---|
| మంత్రాలయం | 145 | 265 | 820 | రూ.6,76,500 |
| కౌతాళం | - | 231 | 462 | రూ.3,81,150 |
| కోసిగి | 240 | 232 | 926 | రూ.7,63,950 |
| పెద్దకడబూరు | 150 | 244 | 788 | రూ.6,50,100 |


కోసిగి బాలుర సమీకృత వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు (పాతచిత్రం)

వసతి గృహ విద్యార్థులకు సౌకర్యాలు, సామగ్రి అందించకపోవడంతో సొంతంగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో విద్యార్థికి నెలకు కాస్మొటిక్ ఛార్జీలు రూ.150 చొప్పున ఏడాదిలో 10 నెలలు అందించాల్సి ఉంది. ఈ లెక్కన ఏడాదికి ఒక్కో విద్యార్థికి రూ.1,500 వరకు రావాల్సి ఉంది. విద్యార్థులు సొంతంగా కొబ్బరినూనె, సబ్బులు, పేస్టులు, బ్రష్‌లు కొనుగోలు చేస్తున్నారు. సుమారు 1,498 మంది విద్యార్థులకు ట్రంకు పెట్టెలు ఇవ్వాలి, కానీ ఇప్పటి వరకు వాటిని అందించలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర సామగ్రిని సక్రమంగా సరఫరా చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కల్లపరి గ్రామంలో మంగళవారం ఏవో రవిప్రకాశ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర స్థాయిలో పంటలు పరిశీలించి సూచనలు చేశారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల బాలికలు వత్తి విద్యా కార్యక్రమంలో భాగంగా నెట్, జిరాక్సు, ఫొటో స్టూడియో, ఐటీకి సంబంధించిన కేంద్రాల్లో శిక్షణ పొందుతున్నారు. మంగళవారం రాష్ట్ర వృత్తివిద్యా కోర్సుల సమన్వయకర్త విక్రమ్ శిక్షణను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయిని మధుప్రియ ఉన్నారు.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వైష్ణవ క్షేత్రం లక్ష్మీమాధవ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

# కర్నూలు

• కర్నూలు • పాణ్యం

## అధిక ధరలకు విక్రయిస్తే ఊరుకోం


సమీక్షిస్తున్న జేసీ డా.బి.నవ్య

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వంట నూనెల ధరలను తక్కువ ధరకు అందించాలని జేసీ డా.బి.నవ్య సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. నూనెలను అధిక ధరలకు విక్రయిస్తే వర్తకుల మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రైతుబజార్లలో టమోటా కిలో రూ.42, ఉల్లిగడ్డలు కిలో రూ.36కు వినియోగదారులకు విక్రయించాలని నిర్ణయించారు. బుధవారం నుంచి ఈ ధరలు అందుబాటులోకి వస్తాయని.. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రాజా రఘువీర్, అర్బన్ ఏఎస్‌వో రామాంజనేయరెడ్డి, నూనె మిల్లులు, వంట నూనె వ్యాపారులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నగరపాలకసంస్థ మేనేజర్ చిన్నరాముడు ఆదేశించారు. ఇందిరాగాంధీ నగర్‌లోని సచివాలయంలో వివిధ వార్డు సచివాలయ అడ్మిన్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్‌ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణ : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : **సమస్య :** వికర్ సెక్షన్ కాలనీలోని వీధుల్లో కాలువలు శుభ్రం చేయాలి. వ్యర్థాలు పేరుకుపోయాయి. – స్థానికులు

**సమస్య:** ఆదిత్యనగర్, గణేశ్ నగర్‌లోని వీధుల్లో సీసీ రోడ్లు వేయాలి. – స్థానికులు

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. – నగరపాలక అధికారులు

## వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో వీధి కుక్కల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇటీవల పాత నగరంలో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ 36 మంది బాధితులు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సాయం అందించారు. నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ చేతులమీదుగా బాధితులకు చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కలకు సంబంధించి కు.ని. శస్త్రచికిత్సలు ఆగిపోయాయని, మళ్లీ ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కుక్కల సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని నగరపాలక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఆరోగ్యాధికారి విశ్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

## బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం కర్నూలులో మాట్లాడారు. ఏటా 3 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్‌బీసీఎఫ్‌డీసీ కింద రాయితీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు.

# నిధులంతా చెత్తలోకే

☛ శుభ్రత పేరుతో పక్కదారి ☛ మార్కెట్ యార్డులో పేరుకుపోతున్న వ్యర్థాలు


యార్డులో పేరుకుపోయిన వ్యర్థాలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కర్నూలు వ్యవసాయ విపణి నిర్వహణ అధ్వానంగా మారింది. ఇక్కడ ప్రతిరోజూ సీజన్ సమయంలో రూ.కోట్లలో పంట దిగుబడుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. విపణికి ఏటా సుమారు రూ.7 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. అయినప్పటికీ పలు సమస్యలు వేధిస్తున్నాయి. మార్కెట్‌లోకి అడుగుపెడితే భరించరాని దుర్గంధం వస్తోంది. దీనికితోడు మురుగు వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగు సాఫీగా వెళ్లేలా కాలువలు నిర్మించకపోవడంతో దిగుబడులకు నష్టం జరుగుతోంది.

### ఏటా సుమారు రూ.10 లక్షల చెల్లింపు

మార్కెట్ యార్డును శుభ్రం చేసేందుకు ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. చెత్తాచెదారాలు తొలగించేందుకుగాను ప్రతి నెల రూ.80 వేలు చెల్లిస్తున్నారు. అయినా ప్రయోజనం శూన్యమే. శుభ్రత మచ్చుకైనా కానరావడం లేదని వినియోగదారులు, రైతులు వాపోతున్నారు. విపణిలో ఎక్కడ చూసినా కుళ్లిన వ్యర్థాలు, మురుగు, పేరుకుపోయిన మట్టి దర్శనమిస్తోంది. నగరంలోని వినియోగదారులు, చిరు వ్యాపారులు, నగర చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు, చిరు వ్యాపారులు వేలాది మంది విపణికి వస్తుంటారు. జిల్లాతోపాటు తెలంగాణ ప్రాంతం నుంచి సైతం రైతులు ఉల్లి, మిర్చి తదితర దిగుబడులు వస్తుంటారు. శుభ్రత పేరుతో ప్రతి నెల రూ.వేలు చెల్లిస్తున్నా ఫలితం ఉండటం లేదు.

### తాగునీటికి ఇబ్బందులే..

☛ హైమాస్ట్ స్తంభం ప్రమాదకరంగా మారింది. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పెను ప్రమాదం జరిగే అవకాశముందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

☛ ఉల్లి మార్కెట్‌లో తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. తాగునీటి శుద్ధజల కేంద్రం దగ్గర అపరిశుభ్రత నెలకొంది. మురుగు నీరు నిలిచిపోవడంతోపాటు పాచిపట్టి ఉండటంతో దుర్వాసన వస్తోంది. ఫలితంగా చాలామంది ఇక్కడ నీటిని తాగేందుకు మొగ్గుచూపడం లేదు.


ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

☛ కూరగాయల మార్కెట్‌లో ఎక్కడపడితే అక్కడ చెత్త డబ్బాలు దర్శనమిస్తున్నాయి. డంపింగ్ యార్డుకు తరలించేలా డబ్బాలు ఉన్నాయి. చెత్తను సకాలంలో బయటకు తరలించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్లిన ఉల్లిగడ్డలు, కూరగాయలతో దుర్గంధం వస్తోంది. ఈ నేపథ్యంలో విపణి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరముంది.

## గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 31 మంది నామినేషన్లు దాఖలు చేశారు. నగరంలోని బహుళార్థ పశువైద్యశాల ఆవరణలో సాంద్ర గొర్రెల విభాగంలో ఎన్నికల అధికారి డా.దుర్గాప్రసన్న బాబు సమక్షంలో 19 మంది అభ్యర్థులు తమ నామపత్రాలు ఉపసంహరించుకున్నారు. దీంతో 12 మంది డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్‌గా గుర్రప్పను ఎన్నుకున్నారు. మరో పది మంది డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. అయితే ఎన్నికల అధికారి డా.దుర్గాప్రసన్న బాబు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

★ గొర్రెలు, మేకల పెంపకందారుల సహకారం సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్లు కలిసి మంగళవారం గొర్రెలు, మేకల పెంపకందారుల సమాఖ్య రాష్ట్ర మాజీ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


నాగేశ్వరరావు యాదవ్‌ను సన్మానిస్తున్న గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఛైర్మన్, డైరెక్టర్లు

## లారీ నుంచి పడి దుర్మరణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ధర్మపేటకు చెందిన మునిస్వామి (47) లారీ నుంచి పడిన ప్రమాదంలో మృతి చెందారు. అతను అదే ధర్మపేటలోని కల్లు డిపోలో పని చేస్తుండేవారు. సోమవారం రాత్రి కల్లు సీసాల లోడు లారీ ఎక్కారు. ధర్మపేట దీప్‌తేజ ఆసుపత్రి వద్ద లారీ డ్రైవర్ బ్రేకు వేయటంతో అదుపుతప్పి పైనుంచి కిందపడ్డారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## కేసీ కాలువలో పడి వృద్ధురాలి మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కేసీ కాలువలో ప్రమాదవశాత్తు పడి గుర్తుతెలియని వృద్ధురాలు (70) మృతి చెందారు. వినాయక ఘాట్ గట్టున మంగళవారం దుస్తులు ఉతుక్కుంటూ అదుపుతప్పి నీళ్లలో పడిపోయారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మూడో పట్టణ పోలీసులు వివరాల కోసం ఆరా తీస్తున్నారు.


## వ్యక్తిపై దాడి..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ఇందిరమ్మ హౌసింగ్ కాలనీకి చెందిన శ్రీనివాసులుపై దాడి జరిగింది. బాధితుడు గాయత్రీ ఎస్టేట్‌లోని ఓ క్లినిక్‌లో పనిచేస్తున్నాడు. సిసింద్రీ, రాజు, మరికొందరు మద్యం తాగేందుకు అడిగినంత డబ్బులు ఇవ్వలేదని శ్రీనివాసులుపై దాడి చేసి గాయపరిచారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

## 11 మంది కేసుల నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి సి.క్యాంపు కూడలిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు. నంద్యాల చెక్‌పోస్టు వైపు నుంచి వచ్చే వాహనచోదకులను తనిఖీ చేయగా 11 మంది మద్యం తాగినట్లు గుర్తించారు. 9 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు.

## మహాలక్ష్మి.. నమోస్తుతే


విజయగణపతి ఆలయంలో ధనలక్ష్మి అలంకరణ


నెహ్రూ నగర్‌లో మహాలక్ష్మిగా దర్శనం


పాతబస్తీ నిమిషాంబ ఆలయంలో..


గీతామందిరంలో


పూజల్లో పాల్గొన్న భక్తులు

నగరంలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని మంగళవారం వివిధ రూపాల్లో అలంకరించారు. పలు ప్రాంతాల్లో మహాలక్ష్మి, ధనలక్ష్మి, శ్రీలలితా త్రిపురసుందరి దేవిగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికాంబ ఆలయం, గీతామందిరం, విజయ గణపతి తదితర ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

– న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, బీక్యాంపు, కల్లూరు గ్రామీణ


పాల్గొన్న మహిళలు


చౌడేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో మహిళలు

## వక్కెరవాగు.. శుభ్రతలో జాగు



కల్లూరు మండలం పెద్దపాడు సమీపంలోని వక్కెర వాగులో ముళ్లపొదలు పెరిగి అధ్వానంగా మారింది. దీంతో వరదలు వచ్చిన ప్రతిసారీ చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వాగులో ముళ్లపొదలు పెరగడంతో నీరు సజావుగా ప్రవహించని పరిస్థితి. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి ఉంది. – ఈనాడు, కర్నూలు

## మార్గబిలం.. ప్రమాదకరం



కల్లూరు పట్టణం మహావీర్ నగర్ సమీపంలో రహదారిపై మార్గబిలం ఉంది. ఇది కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. రాకపోకలు సాగించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరపాలక అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

## సంక్షిప్త సమాచారం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పంటలను ఆశించే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏవో సుధాకర్ సూచించారు. మండలంలోని పూడిచెర్ల, కేతవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు జొహరాపురం 19వ వార్డులోని వక్ఫ్ బోర్డు భూముల్లో కొందరు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్నారని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్‌హుస్సేన్, షరీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని.. వెంటనే విచారణ జరిపి వక్ఫ్ ఆస్తులు కాపాడాలని కోరారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : గతేడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రావాల్సిన పంట నష్టపరిహారం రూ.184 కోట్లు ఇప్పటివరకు అందలేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: సర్దుబాటు పేరుతో విద్యుత్తు సంస్థలు విద్యుత్తు ఛార్జీలను పెంచాలనే ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య తదితరులు డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులతో నగరంలోని బీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ మంగళవారం సాయంత్రం జడ్పీ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. పంచాయతీ నిధులు, ఆదాయ వ్యయాలపై చర్చించారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో అధికారి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణల నేపథ్యంలో విచారణ జరపాలని విశ్వహిందూ పరిషత్ దక్షిణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం కోరారు. అవినీతి తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాను పత్తికొండ ఆర్డీవో ఎస్.భరత్ నాయక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎన్నికల్లో ఛైర్మన్‌గా శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న తదితరులు ఛైర్మన్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు.

## రహదారికి మరమ్మతులు

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆర్.కొంతలపాడు సమీపంలోని వాగులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే ప్రాంతంలో సోమవారం పత్తి లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం బోల్తా పడి ఇద్దరు మృతి చెందడంతో కర్నూలు తాలూకా సీఐ శ్రీధర్ స్పందించారు. తమ సిబ్బందితో కలిసి గుంతల్లో మట్టి వేసి మరమ్మతులు చేయించారు. సమస్య శాశ్వత పరిష్కారమయ్యేదాకా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులకు సీఐ సూచించారు.


దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పోలీసు సిబ్బంది

## 16న మరళి-1 ఇసుక రీచ్ ప్రారంభించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కౌతాళం మండలం మరళి-1 ఇసుక ఓపెన్ రీచ్‌ను 16వ తేదీన ప్రారంభించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇసుక సులభంగా అందించేందుకు వీలుగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఇసుక లభ్యత ప్రదేశాలు ఏవైనా ఉన్నాయా అని పరిశీలించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పనులకు ప్రాధాన్యమిస్తూ ఇసుక కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు.

## విపణిలోకి నూతన కారు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కర్నూలు నగర పరిధి ఆటోనగర్‌లోని హైటెక్ నిస్సాన్ షోరూంలో మంగళవారం నిస్సాన్ మ్యాగ్నైట్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హైటెక్ మోటార్సు ఎండీ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కారును అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాస శాస్త్రి, సేల్స్ మేనేజర్ లోకేష్ బాలాజీ, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కారు ఆవిష్కరణలో ప్రతినిధులు

## అవినీతిపై విచారణ జరపాలి

ఓర్వకల్లు న్యూస్‌టుడే: కాల్వబుగ్గ ఆలయంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. వారు మంగళవారం ఓర్వకల్లులో మాట్లాడారు. అధికారులు ఆలయాల అభివృద్ధిని పక్కనపెట్టి అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. ఆలయంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

## జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఏలూరులో ఇటీవల జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అండర్-20 విభాగంలో కర్నూలు డిగ్రీ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం బీకాం విద్యార్థిని వీణాకుమారి వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా త్వరలో నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంటు ఉమామహేశ్వర రావు తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి పతకం సాధించాలని ఆకాంక్షించారు.


ధ్రువపత్రం అందుకుంటున్న విద్యార్థిని

## ఆదాయ వనరులు పెంపొందించాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసే నిధులతోపాటు సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవాలని జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. కర్నూలు జడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్సీ భవనంలో ఎంపీడీవోలు, ఈవోఆర్డీలకు మూడు రోజులు నిర్వహించే శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కనీస వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి మాట్లాడుతూ పంచాయతీల ప్రగతికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు నిధులు కేటాయిస్తున్నాయని తెలిపారు. డీపీవో జి.భాస్కర్, కర్నూలు, ఆదోని డీఎల్‌పీవోలు తిమ్మక్క, నూర్జహాన్, డీపీఆర్సీ శిక్షణ మేనేజరు గిడ్డేష్, రాజవర్ధన్, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి

# నిధులు వెచ్చించి.. నిర్వహణ మరిచి

### అధ్వానంగా ఉద్యానవనాలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరంలో 52 వార్డులు ఉన్నాయి.. నగరం రోజురోజుకు విస్తరిస్తోంది. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 112 పార్కు స్థలాలు ఉండగా అందులో కేవలం 51 పార్కులను మాత్రమే అభివృద్ధి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మిగిలిన వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలో థీమ్ పార్కుల పేరుతో కొన్నింటిని అభివృద్ధి చేశారు. దీనికిగాను రూ.లక్షలు నిధులు వెచ్చించారు. చాలా ప్రాంతాల్లో ఉద్యానవనాల నిర్వహణ అధ్వానంగా మారింది. సిబ్బంది ఉన్నప్పటికీ సేవలు మాత్రం సక్రమంగా అందడం లేదు. సిబ్బందిని ఇతరత్రా పనులకు వినియోగిస్తున్నారు. కొంతమంది పార్కుల్లో పనులు చేయకున్నా.. విధులకు హాజరుకాకున్నా పట్టించుకోవడం లేదు.

### వ్యాయామ పరికరాలు దెబ్బతిని..

నగరంలోని పలు ఉద్యానవనాలను అంతంతమాత్రంగానే అభివృద్ధి చేశారు. అందులో అమర్చిన వ్యాయామ పరికరాలు, ఆట వస్తువులు ధ్వంసమయ్యాయి. నాసిరకంగా ఏర్పాటుచేయడంతో ఎందుకూ పనికిరాకుండా పోయాయి. కొన్ని ఉద్యానవనాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. వర్షాకాలం కావడంతో ఉద్యానవనాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

★ నగరవాసులు ఏటా ఆస్తి, నీరు, ఇతరత్రా పన్నులను నగర పాలక సంస్థకు చెల్లిస్తున్నారు. ఏటా పన్నుల లక్ష్యం రూ.90 కోట్ల వరకు ఉంది. జనం క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నా ప్రజలకు మాత్రం సేవలందడం లేదు. కుటుంబసమేతంగా కొన్ని పార్కులకు వెళ్లాలంటే ప్రవేశ, పార్కింగ్ రుసుము చెల్లించాల్సిన పరిస్థితి. ఇలా ఒక కుటుంబం వారాంతంలో ఒకసారి బయటకు వస్తే రూ.100 వరకు భారం పడుతోంది.

### పిచ్చిమొక్కలు పెరిగి..

ఈ చిత్రం వినాయక ఘాట్ సమీపంలోని ఉద్యానవనం. ఈ పార్కుకు నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వస్తుంటారు. ఉద్యానవనం నిర్వహణ అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతోపాటు బొమ్మలు, చిన్నపిల్లలు ఆడుకునే ఆట వస్తువులు మూలనపడ్డాయి. అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిందని పలువురు సందర్శకులు పేర్కొంటున్నారు. పచ్చదనం మాయమైందని.. పలు సమస్యలు నెలకొన్నా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు.



## అక్రమాలపై విచారణ అవసరం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప పేర్కొన్నారు. ఆర్‌యూ ఎదుట విద్యార్థి సంఘాల నేతలు మంగళవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగులకు అక్రమంగా టైమ్ స్కేల్ ఇచ్చి హెచ్‌ఆర్‌ఏ, ఐఆర్ వర్తింపజేస్తూ పదోన్నతులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ విజయభాస్కర్, అంబేడ్కర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

## పల్లె పండగకు పకడ్బందీ ఏర్పాట్లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. కర్నూలు నుంచి కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడారు. జిల్లాలో రూ.105 కోట్లతో సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లు తదితర పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

☛ ఉపాధి హామీ పనుల కల్పనలో వంద శాతం లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఆయన మంగళవారం పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యంలో 53 శాతం మాత్రమే సాధించారని పేర్కొన్నారు.